క్లుప్తంగా

నియామకం


జమాలొద్దీన్

నడికూడ: జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎస్‌హెచ్‌ఆర్‌సీ) మండల అధ్యక్షుడిగా నడికూడకు చెందిన మహ్మద్ జమాలొద్దీన్‌ను నియమిస్తూ.. హనుమకొండ జిల్లా అధ్యక్షుడు చంద్రగిరి సునీల్ కుమార్ ఆదివారం నియామక పత్రం అందజేశారు. ఈసందర్భంగా సునీల్ కుమార్ మాట్లాడుతూ.. మానవ హక్కులను కాపాడడం, మానవ సంబంధాలు మెరుగుపరచడం, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో జరిగే అవినీతి అక్రమాలను వెలికి తీసి, సామాన్యులకు అండగా ఉండేందుకు ఎస్‌హెచ్‌ఆర్‌సీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఆర్థిక సాయం


బాండ్ పేపర్ అందజేస్తున్న స్నేహితులు

వేలేరు: స్నేహితుడి భార్య చనిపోవడంతో అతడి కుటుంబానికి తోటి స్నేహితులు అండగా నిలిచారు. మండలంలోని శాలపల్లి శివారు లక్ష్మీ తండా గ్రామానికి చెందిన మాలోతు తిరుపతి భార్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. తిరుపతితో కలిసి పదో తరగతి వరకు చదువుకున్న జెడ్పీఎస్ఎస్ మల్లారం 2006–07 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం తిరుపతి కుటుంబాన్ని పరామర్శించి, మృతికి గల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్నేహితుడి కూతురి పేరిట రూ.40వేలు ఎల్ఐసీలో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించి బాండ్ పేపర్‌ను అందజేశారు.

ఆల్ఫా ఒమేగాలో ఎమ్మెల్యే ప్రత్యేక ప్రార్థనలు

మడికొండ: కాజీపేట మండలం మడికొండ ఎస్సీ, బీసీ కాలనిలోని 16వ ఆల్ఫా ఒమేగా ప్రార్థన మందిర ప్రతిష్ఠ పండుగలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల రాజుయాదవ్, వస్కుల శంకర్, కడమంచి సాయిలు, ఫాదర్ జాన్ మార్కేండయ్య, స్థానికులు విజయ్, లింగమూర్తి, రఘుచందర్, నవీన్ యాదవ్, వినయ్, అప్పి, చంటి, స్థానికులు పాల్గొన్నారు.

పట్టణంలో ఆకస్మిక తనిఖీలు

కాజీపేట: పట్టణ పురవీధుల్లో ఆదివారం తెల్లవారుజామున పోలీసులు విస్తృతంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రైల్వే స్టేషన్, బస్టాండ్‌లతో పాటు ప్రధాన కూడళ్ల, కాలనీల్లో అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తులను ఆపి సోదాలు జరిపి కొంత మందిని అదుపులోకి తీసుకుని విచారించి పంపించారు. ప్రజలు పండుగ సందర్భంగా సొంత ఊర్లకు వెళ్తున్న నేపథ్యంలో చోరీలు జరిగే అవకాశం ఉన్నందున బీట్ కానిస్టేబుల్స్‌తో పాటు బ్లూకోర్ట్ సిబ్బంది, క్రైం పోలీసులను అప్రమత్తం చేశారు. సీపీ అంబర్ కిశోర్ ఝా ఆదేశం మేరకు సీఐ సార్ల రాజు పర్యవేక్షణలో ఎస్సైలు నాలుగు జట్లుగా విడిపోయి తనిఖీలను నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులతో పాటు కార్లను కూడా వదిలి పెట్టకుండా తనిఖీలు చేసి రాత్రి ప్రయాణాలు చేయడానికి గల కారణాలపై వాహనదారులను నిలదీశారు. ఏ ప్రాంతంలో నేరం జరిగిన వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని లేనిపక్షంలో మీరే ఘటనకు బాధ్యత వహించాల్సి ఉంటుందని సీఐ సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు.

మేర సంక్షేమ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

కాజీపేట : మండలంలోని సోమిడి ప్రభుత్వ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం మేర కుల సంక్షేమ సంఘం నూతన క్యాలెండర్‌ను సభ్యులు ఆవిష్కరించారు. 63వ డివిజన్ కార్పొరేటర్ విజయశ్రీ, మాజీ కార్పొరేటర్ జక్కుల రమ ఆధ్వర్యంలో క్యాలెండర్‌ను సభ్యులకు పంపిణీ చేశారు. సంఘం గౌరవ అధ్యక్షుడు విద్యాసాగర్, అధ్యక్షుడు వెంకటేష్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, శ్యాంసుందర్, సుధీర్ పాల్గొన్నారు.

పండ్లు పంపిణీ

హసన్‌పర్తి : నగరంలోని అతిథి దివ్యాంగుల కేంద్రంలో ఆదివారం పండ్లు పంపిణీ చేశారు. హసన్‌పర్తి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో లయన్స్ నాగమళ్ల రోజా జ్ఞాపకార్థం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు వక్తలు మాట్లాడారు. నాగమళ్ల సుధీర్, శ్రీకాంత్, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

సనాతన సంప్రదాయమే గొప్పది

వరంగల్: సంప్రదాయాల కంటే సనాతన సంప్రదాయమే గొప్పదని శివానందగురు కల్చరల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ త్రిపురనేని గోపిచంద్ అన్నారు. ఆదివారం ములుగురోడు సమీపంలోని సప్తగురుధామంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అందరూ సనాతన ధర్మాన్ని ఆచరించాలని కోరారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఉత్తమ మహిళా కార్యక్రమంలో జె.శిరీషకు మొదటి బహుమతి రూ.10,116, రెండో బహుమతి, టీ.భావన రూ.5,116, మూడో బహుమతి సీహెచ్.జ్ఞాన కుమారి రూ.2,116 అందజేశారు.

రంగవల్లుల కళకళ


పరకాల: ముగ్గు వేస్తున్న మహిళ


పరకాలలో ముగ్గు వేస్తున్న యువతులు


ఎల్కతుర్తిలో.. ముగ్గులు వేస్తున్న యువతులు


పరకాలలో..

- ఘనంగా భోగి వేడుకలు
- ప్రతి ఇంటా పిండివంటల ఘుమఘుమలు

ఎల్కతుర్తి: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల ప్రజలు ఆదివారం భోగి వేడులను ఘనంగా జరుపుకున్నారు. మహిళలు ముంగిళ్లలో రంగులతో వేసిన ముగ్గులు ఆకట్టుకున్నాయి. ఆవుపేడతో తయారు చేసిన గొబ్బెమ్మలు పెట్టి పూలు నవధాన్యాలు, రేగు పండ్లు పోశారు. పిండి వంటకాల ఘుమఘుమలతో ప్రజలు పండుగను ఆస్వాదించారు. పిల్లలు, పెద్దలు పతంగులు ఎగురవేశారు. సంప్రదాయానికి ప్రతీకగా పలు గ్రామాల్లోని ప్రజలు భోగిమంటలు వేసి సందడి చేశారు.

కమలాపూర్: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఆదివారం సంక్రాంతి భోగి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. కమలాపూర్‌లోని రావి చెట్టు కూడలి వద్ద ప్రగతి యువజన సంక్షేమ సంఘం, ప్రగతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉదయాన్నే భోగి మంటలు వేశారు. చిన్నా, పెద్ద తారతమ్యం లేకుండా మహిళలు, చిన్నారులు, యువకులు, పారిశుద్ధ్య కార్మికులు ఉత్సాహంగా ఆటపాటలు, నృత్యాలతో సందడి చేశారు. భోగి సందర్భంగా మహిళలు ఇళ్ల ముందు అందమైన రంగవల్లులు అలంకరించి ఆవు పేడతో తయారు చేసిన గొబ్బెమ్మలు, రేగు పండ్లు, నవధాన్యాలు పోశారు. అనంతరం ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రగతి యూత్ అధ్యక్షుడు మండ రాజేష్‌కుమార్, దేవేందర్, కుమారస్వామి, ఓంకేష్, సుందర్, రాజు, కరుణ్, అశోక్, శ్రీకాంత్, శ్రావణ్, రాజేందర్, జగన్ పాల్గొన్నారు.

పరకాల: పరకాల పట్టణ ప్రజలు ఎంతో సంబురంగా భోగి జరుపుకున్నారు. పిండి వంటలు చేయడం, భోగిమంటలతో పాటు ప్రతి ఇంటి ఎదుట రంగులతో ముగ్గులు వేశారు. పాఠశాలలు, కళాశాలలకు సంక్రాంతి సెలవులు ప్రకటించడంతో హాస్టళ్ల నుంచి ఇంటికి చేరుకున్న పిల్లలు, బంధువులతో కలిసి గాలిపటాలు ఎగరేస్తూ ఆనందంగా గడిపారు.


దామెరలో ముగ్గు వేస్తున్న ఆడపడుచులు


కమలాపూర్‌లో..


కమలాపూర్ : ముగ్గు వేస్తున్న ఉపాధ్యాయురాలు

ఊరుగొండలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

దామెర: మండలంలోని ఊరుగొండ శ్రీలక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం బిందె తీర్థం, పూర్ణాహుతి, ద్వజపట, ఉద్వాసన కార్యక్రమాలను ప్రధాన అర్చకులు తూపురాణి శ్రీనివాసచార్యులు నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా సోమ, మంగళవారాల్లో గుట్టపైన జరిగే జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామని సర్పంచ్ గోగుల సత్యనారాయణ రెడ్డి తెలిపారు. పార్కింగ్, దుకాణాల ఏర్పాటుకు స్థలాన్ని చదును చేశారు.


ద్వజపట కార్యక్రమంలో పాల్గొన్న పూజారులు

ఆలయంలో ఆంక్షలపై బీజేపీ మండిపాటు

ఐనవోలు: చారిత్రక నేపథ్యం కలిగిన ఐనవోలు శ్రీమల్లికార్జునస్వామి ఆలయంలో ఆంక్షలు విధించడం అంటే భక్తులను మల్లన్న దర్శన భాగ్యానికి దూరం చేయడమేనని బీజేపీ హనుమకొండ జిల్లా కార్యదర్శి గుండెకారి కోటేశ్వర్ రావు పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. లక్షలాది మంది భక్తులతో సందడిగా ఉండే ఆలయంలో వీఐపీ పాసులను రద్దుచేయాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి హిందూ దేవాలయాలపై చిన్నచూపు చూస్తుందని భక్తులు గమనించాలన్నారు. వీఐపీ అంటే కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన తాను ఒక్కడినే అన్నట్లుగా వ్యవహరించడం కేఆర్ నాగరాజుకు తగదన్నారు. ఆలయం విషయంలో నేను చెప్పిందే.. వేదం అన్నట్లు నాగరాజు వ్యవహరిస్తూ అధికారులను ఆదేశించడం బాధాకారం అన్నారు. డబ్బులున్న వారికే దర్శనం అన్న రీతిలో వీఐపీ టికెట్ ధరలు ఏకంగా రూ.500గా నిర్ణయించడం కాంగ్రెస్ పాలనలో మల్లన్న భక్తుల జేబులు గుల్లా కావడం ఖాయంగా కనిపిస్తుందన్నారు. గెలిచి నాలుగు రోజులు కాకముందే అధికార మత్తులో ఎమ్మెల్యే ఇష్టారీతిన మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. ఎమ్మెల్యే తీరుపై కాంగ్రెస్ పార్టీ నాయకులు కూడా సంతోషంగా లేరని, అంతర్గతంగా అసహనం వ్యక్తం చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వివాదాస్పదంగా మారిన వీవీఐపీ టికెట్

- టికెట్ ధర రూ.500గా నిర్ణయం

ఐనవోలు: ఐనవోలు ఆలయంలో నూతనంగా తీసుకొచ్చిన వీవీఐపీ టికెట్ పలు వివాదాలకు కేంద్ర బిందువుగా మారింది. జాతర సమయంలో ఆలయానికి వీవీఐపీలు అధికంగా వస్తుంటారు. అయితే వీరి దర్శనం వల్ల సామాన్యులకు ఇబ్బందులు తలెత్తకూడదన్న ఉద్దేశంతో వీవీఐపీ పాసులు ఇవ్వకూడదని నిర్ణయించారు. కానీ, అమలు చేస్తున్న తీరుపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. వీవీఐపీ టికెట్ ధర రూ.500గా నిర్ణయించి ఆలయానికి వచ్చిన ప్రతిపక్ష పార్టీలకు చెందిన ప్రముఖులు తప్పనిసరి టికెట్ కొనుగోలు చేయాలని సిబ్బంది తెలిపారు. అయితే, టికెట్ కొనుక్కున్న సదరు వీవీఐపీలను వెంటనే లోపలికి అనుమతించకుండా సుమారు అరగంట పాటు బయట వేచి ఉంచడం వివాదాస్పదంగా మారింది. ప్రతిపక్ష నేతలపై ఆలయ ఉత్సవ కమిటీ, అధికారులు వ్యవహరించిన తీరు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఉత్సవ కమిటీ బాధ్యులు ప్రతిదాంట్లో తలదూర్చుతున్నారని భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వీవీఐపీ టికెట్ కౌంటర్‌లో ఉత్సవ కమిటీ సభ్యులు కూర్చుని వారి అనునాయులకు ఒక టికెట్‌పై ఐదుగురికి అనుమతిస్తున్నారని, కానీ ఇతరులు వస్తే మాత్రం ప్రతి ఒక్కరూ టికెట్ కొనుగోలు చేయాలని చెబుతున్నారని భక్తులు ఆరోపిస్తున్నారు. దర్శనం చేసుకోవాలంటే చివరికి స్థానిక ప్రజాప్రతినిధులు కూడా టికెట్ కొనుక్కోవాల్సిన పరిస్థితి నెలకొనడంతో మల్లన్న భక్తులు ముక్కున వేలేసుకుంటున్నారు.



టికెట్ కౌంటర్‌లో ఉన్న ఉత్సవ కమిటీ సభ్యుడు

గ్రామాల్లో అయోధ్య అక్షింతల వితరణ


శాయంపేట : అక్షింతలు వితరణ చేస్తున్న భక్తులు

శాయంపేట : అయోధ్య రామ మందిరం ట్రస్ట్ పంపించిన అక్షింతలను ఆదివారం కొత్తగట్టు సింగారం, మాందారిపేట, శాయంపేట గ్రామాల్లో గ్రామ సంయోజక మహేశ్వర రాజు ఆధ్వర్యంలో గ్రామస్తులకు పంపిణీ చేశారు. మండల సంయోజక్ గిద్దమారి సురేష్ గిద్దమారి సురేష్, తినేటి ప్రభాకర్ రెడ్డి, ఆదిరెడ్డి పాల్గొన్నారు. భక్తి గీతాలు ఆలపిస్తూ వీధుల్లో ఊరేగించి గడపగడపకూ నగర సంకీర్తన చేస్తు అక్షింతలను వితరణ చేశారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఆదిరెడ్డి, రమణారెడ్డి, రాజమల్లు, మనుపాటి వేణు, పెంబర్తి రమేష్, క్యాతం రంజిత్, లకిడి రాజు, కందికొండ రమేష్, పోకిడి శివాజీ, మాందారిపేట గ్రామస్తులు పురుషోత్తం రెడ్డి, సాంబరాజు పాల్గొన్నారు.

వేలేరు: మండలంలోని శాలపల్లి గ్రామానికి అయోధ్య నుంచి తీసుకొచ్చిన రాముడి అక్షింతలను రామ భక్తులు ఆదివారం ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. కుల, మత బేధాలు లేకుండా ప్రతి ఒక్కరూ ఈనెల 22న నిర్వహించే అయోధ్య రాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని గ్రామాల్లో పండగ వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. చిలుక రాజు, రమేష్, రాజు, సంపత్, రాజేంద్రప్రసాద్, వెంకటయ్య పాల్గొన్నారు.

శ్రీషిర్డీ సాయి సత్సంగ్ మందిర్ వార్షికోత్సవం

పరకాల: పరకాల పట్టణంలోని శ్రీషిర్డీ సాయి సత్సంగ్ మందిర్ వార్షికోత్సవాన్ని ఆదివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సాయిబాబాను దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం సాయి నామస్మరణతో మార్మోగింది. భక్తుల కోలాటం, దాండీయా నృత్యాలతో జరిగిన రథోత్సావాన్ని పట్టణ ప్రజలు ఎంతో ఆసక్తిగా తిలకించారు.


సాయిమందిర్ నుంచి బయలుదేరిన రథోత్సవం

మల్లన్న పాదాల వద్ద పూజలు

ఐనవోలు: మండలంలోని సింగారం గ్రామ పరిధిలో ఉన్న శ్రీమల్లికార్జునస్వామి వారి పాదాల గుడిలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ మాజీ డైరెక్టర్ సొనబోయిన సతీష్ తెలిపారు. అతి పురాతనమైన కాకతీయులు పాలించిన పుట్ట కోటపై మల్లన్న పాదాలు ఉండడం సింగారం ప్రజలకు గర్వకారణం అన్నారు. తిమ్మాపూర్, మామునూర్, కొండపర్తి, ముల్కలగూడెం, వరంగల్, బొల్లికుంట తదితర ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి స్వామి వారి పాదాలను దర్శించుకుని, మొక్కులు చెల్లిస్తారని చెప్పారు. ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు చొరవ తీసుకుని ఆలయాన్ని అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. మాజీ ఎంపీటీసీ సమ్మిరెడ్డి, రాజు, అనిల్, తిరుపతి పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న సతీష్ తదితరులు

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత


శివమార్కండేయ స్వామి ఆలయంలో గోదా కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

శాయంపేట: ప్రస్తుతం ప్రతి ఒక్కరూ మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని హోంశాఖ ప్రభుత్వ న్యాయవాది మామిడి రూపేందర్ అన్నారు. మండల కేంద్రంలోని శివ మార్కండేయ, వేంకటేశ్వరస్వామి ఆలయ సముదాయాల్లో భోగిని పురస్కరించుకుని ఆదివారం గోదాదేవి రంగనాయకుల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా రూపేందర్ కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ఆలయ అర్చకులు మార్త రాజ్‌కుమార్, పురోహితులు రమేశ్ వేదమంత్రాల మధ్య అంగరంగా వైభవంగా కళ్యాణాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీమత్స్యగిరి స్వామి ఆలయంలో ఆలయ అర్చకులు ఆరుట్ల కృష్ణమాచార్యులు గోదారంగనాయకుల కల్యాణాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్లుఎ బాసాని సూర్యప్రకాశ్, సామల భిక్షపతి, భక్తులు పాల్గొన్నారు.

కొత్తకొండ వీరభద్రుడికి ప్రత్యేక పూజలు

- దర్శించుకున్న కరీంనగర్ ఎంపీ బండి సంజయ్
- సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు
- ఆలయానికి పోటెత్తిన భక్తులు


దర్శనం కోసం క్యూలో ఉన్న భక్తులు

ఎల్కతుర్తి: కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. స్వామి వారిని దర్శించుకునేందుకు సుమారుగా గంటన్నర సమయం పట్టింది. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ముత్తారం గ్రామంలోని త్రికుటేశ్వర ఆలయాన్ని సందర్శించి శివున్ని దర్శించుకున్నారు. అనంతరం కొత్తకొండకు చేరుకొని వీరభద్రుని దర్శించుకున్నారు. కాగా ఆలయంలోకి బండి సంజయ్‌తో పాటు హనుమకొండ బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, బొమ్మ శ్రీరామ్‌చక్రవర్తిని తప్పితే మిగతా నాయకులను పోలీసులు అనుమతించకపోవడంతో పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం వారిని పోలీసులు అనుమతించడంతో ఆందోళన సద్దుమనిగింది. అర్చకులు బండి సంజయ్‌తోపాటు, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులుకు వేర్వేరుగా పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. భక్తులు కోడె మొక్కులు, గుమ్మడికాయలు, కోర మీసాలు స్వామివారికి సమర్పించి మొక్కులు చెల్లించారు. గండ దీపం వెలిగించి కుటుంబసమేతంగా మొక్కులు చెల్లించారు. ఆలయ ఈఓ కిషన్‌రావు, ఎంపీడీఓ భాస్కర్‌రావు, ఆలయ ముఖ్య అర్చకులు సదానందం, సర్పంచ్ దూడల ప్రమీల, యాటపోలు రాజమణి, ఉప ప్రధాన అర్చకులు రాజయ్య, రాంబాబు, అర్చకులు శ్రీకాంత్, వీరభద్రయ్య, రమేష్, శివకుమార్, చరత్‌చంద్ర, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. భోగిరోజు స్వామివారికి ఉదయం గణపతిపూజ, శైవశుద్ధి, పుణ్యాహవచనం, నిత్యాపాసన, సూర్యయంత్ర స్థాపన, హారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ, సాయంత్రం మంటపపూజ, నిత్యహోమం, దుర్గా త్రిశతి పారాయణం, హారతి మంత్రపుష్పం నిర్వహించినట్లు అర్చకుడు రాంబాబు తెలిపారు.


వీరభద్రస్వామిని దర్శించుకున్న బండి సంజయ్


సీఎం ఓఎస్డీకి స్వాగతం పలికిన అర్చకులు


కోడె మొక్కు చెల్లిస్తున్న భక్తులు

రామకోటి రాసిన సహృదయ ఆశ్రమ వృద్ధులు


రామకోటి పుస్తకాలను స్వీకరిస్తున్న యాకుబీ

కాజీపేట: నగరంలోని 61వ డివి జన్ ప్రశాంత్‌నగర్ కాలనీలోని సహృదయ అనా థ వృద్ధాశ్రమంలో సేద తీరుతు న్న వృద్ధులతో రామకోటిని రా యించి కా జీపేట రామాలయంలో సమర్పించారు. ఆశ్రమ నిర్వాహకురాలు ఎండీ.యాకూబీ ఆశ్రమంలో ఎంతో కాలంగా ఉంటున్న 50 మంది వృద్ధులతో రామకోటిని పూర్తి చేయించారు.

బీఆర్ఎస్‌కు ప్రజలే గుణపాఠం చెప్పారు

వేలేరు: బీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెప్పారని కాంగ్రెస్ పార్టీ మండల ఇన్‌చార్జ్ మల్కిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి అన్నారు. మండలంలోని చింతలతండా గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులు వివిధ పథకాలు పెట్టి ప్రజలవద్ద నుంచి లక్షలాది రూపాయలు కమిషన్లు తీసుకున్నారని ఆరోపించారు. ఇటీవల వేలేరు మండలానికి వచ్చిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి లంకెబిందెల గురించి మాట్లాడాడని, లంకె బిందెలు ఇప్పుడు ఎవరి దగ్గర ఉన్నాయో.. విచారణలో బయటికి వస్తాయని అన్నారు. రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా డిగ్రీ పాసైన ప్రతీ ఒక్కరినీ ఓటరుగా నమోదు చేసేందుకు స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా.. బీఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ ఎంపీటీసీ సాంబరాజు ఆయన అనుచరులు ఆపార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. గ్రామశాఖ అధ్యక్షుడిగా మాలోతు రమేష్, ఉపాధ్యక్షుడిగా సంపత్, ప్రధాన కార్యదర్శిగా సుధాకర్, కోశాధికారిగా సాయికుమార్, కార్యదర్శిగా అరుణ్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజమల్లయ్య, సంపత్, దేవెందర్‌రెడ్డి, జైపాల్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రాజేశ్వర్ రెడ్డి

అంగన్‌వాడీ కేంద్రానికి త్వరలో మరమ్మతులు


అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

కాజీపేట అర్బన్ : 45వ డివిజన్ పరిధి కడిపికొండలోని శిథిలావస్థలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం భవనానికి త్వరలో మరమ్మతులు స్మార్ట్ సిటీ ఫండ్స్‌తో చేపట్టనున్నట్లు వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు తెలిపారు. కడిపికొండలో ఆదివారం ఆయన ఇంటర్నల్ రోడ్స్, సైడ్ డ్రెయిన్స్‌ను పరిశీలించి త్వరితగతిన పనులు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆయన వెంట కాంగ్రెస్ కాజీపేట మండల అధ్యక్షుడు రాజుయాదవ్, కార్పొరేటర్ అనిత, వెంకటరమణగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, రమేష్ ఉన్నారు.